గెలుపు మనదే

ఊరికి ఉత్తరపు వీధి చివరనున్నదా ఇల్లు. రెండు నిట్టాడులు గల పూరికొంప. తలవాకిలి మినహాయించి, చుట్టూ వొత్తుగా గల చిల్లకంప సరిహద్దులు. ఓ మూల మరల భావి. ఇంకో ప్రక్క పాడిగేదెకు సోపరా, దాని చెంతనే చిన్న గడ్డివామి. ఆ వామికి వెనుకభాగాన కూరగాయల పాదులు. ఆ పాదుల్లో ఏపుగా పెరిగినచెట్లు విరగ్గాసి – ఇంటి సౌభాగ్యానికి నిదర్శనాలుగా నిలిచినయ్.

శీతాకాలపు సూర్యుడు పదిబార్ల మేరకు పైకి ఎక్కినా ఎండలో వేడిలేదు. దూరంగా పొలాల గట్లపైనా, డొంకలోనూ వున్న తాటిచెట్లూ, ఈత చెట్లూ గాలికి గోల చేస్తున్నాయి.

ఇంటి ఇల్లాలు నాగరత్తమ్మ అప్పుడే గేదె పాలుపితికి, పిడతలోపోసి, పొయ్యిమీదపెట్టి, చాటలో బియ్యం పోసి

కొని ఇంటిముందు వరండాలో నాపరాయిమీద కూర్చుని మట్టిగడ్డలు ఏరుతూంది. అయిదేళ్ళ కూతురు అంతకుముందే పలకా, బలపమూ పుచ్చుకుని ఎలిమెంటరీస్కూలుకి వెళ్ళింది.

ఆ ఉదయం ప్రశాంతంగా వుంది. కాని నాగరత్నమ్మ మనస్సు అట్లా లేదు. చైనా ముష్కరులు భారతదేశపు ఉత్తర సరిహద్దులపై ధర్మాధర్మ విచక్షణలేకుండా భారీయెత్తున అకారణంగా, అన్యాయంగా దాడులు ప్రారంభించారు. శాంతిగా, స్నేహంగా, సోదరభావంతో ఇంతకాలమూ నటిస్తూ – హఠాత్తుగా ఓ అర్ధరాత్రి దాటాక వెన్నుపోటు పొడిచారు. నిశ్చింతగా నిద్రపోతూన్న మంచివాడ్ని ఓ కిరాతకుడు కత్తితో పొడిచిన పోటు లాంటిదే అది. ఉలిక్కిపడిన సింహంపగిది భారతజాతి యావత్తూ మేల్కొంది. వారిదొంగ చాటు దారుల్ని తిప్పికొట్టేందుకు, కుతంత్రంగా చొచ్చుకుని వచ్చి దురాక్రమణచేసిన ప్రాంతాలనుంచి తరిమికొట్టేందుకు స్వాతంత్ర్య పరిరక్షణకు – మన సేనలూ, ప్రజలూ సమాయత్తమై ఉత్సాహంతో ముందుకు దుమికారు. మాతృభూమి రక్షణే జీవితాదర్శంగా మన జవానులు, అధికారులు అసమానధైర్య సాహసాల్ని ప్రదర్శించి, అపూర్వ త్యాగాన్ని చేశారు. మన సైనికులు తుపాకుల్లో చివరగుండు అయిపోయ్యేదాకా, జట్టులో చివర సైనికుడు నేలకొరిగేవరకూ – వీరోచితంగా భీషణ సమరం సాగిస్తూనే ఉన్నారు. తీవ్రంగా ప్రతిఘటిస్తూనే ఉన్నారు.

కాని నేఫా ప్రాంతాల్లో అననుకూల వాతావరణం, అలలు అలలుగా అత్యధికసంఖ్యలో వచ్చిపడే చైనా సైనికబలమూ, యుద్ధంలో వాళ్ళు ఉపయోగించే భారీ ఫిరంగులు, మోర్టారులు, మర తుపాకులు, ఆటోమేటిక్ రైఫిల్సు మొదలైన ఆధునిక ఆయుధాలు, వాళ్ళ దొంగచాటు యుద్ధ సన్నాహాలూ, మోసాలూ – మనకు తాత్కాలిక అపజయాన్ని కలిగించినా, పునఃసమీకరణ నిమిత్తం మనసైనికులు స్థావరాన్ని విడిచి పెట్టినా, 'గెలుపు మనదే' అన్న విశ్వాసం ద్విగుణీకృతం అవుతున్నది. అంకుఠిత ధైర్య స్థైర్యాలతో, అచంచల దీక్షతో మన సైనికులు నిర్విరామంగా పోరాటం జరుపుతున్నారు. శత్రువులకు అపారనష్టాల్ని గావిస్తున్నారు. నేఫా పూర్వరంగంలో జరిగే పోరాటంలో నాగరత్నమ్మభర్త రనాసరయ్య కూడా ఉన్నాడు. మాతృదేశరక్షణ మహాయజ్ఞంలో కొంతమంది జవానులు అసువులు గోల్పోతున్నారు. మరి తన భర్త పరిస్థితేమిటి? తన కేదో భయం భయంగావుంది. అమ్మ అంటూనే వుంది. 'మిలిటరీలో జేరినాక వాడు మనవాడు కాదే! ఏ క్షణంలో ప్రాణం ఎగిరి పోతుందో చెప్పలేం!' కాని ఆయనగారు సురక్షితంగానే వుంటారు. యుద్ధంలో తీవ్రంగా పోరుసల్పి సలక్షణంగా తిరిగి వస్తారు. పైన భగవంతుడున్నాడు. కర్మభూమియైన భారతదేశం పట్ల న్యాయం, ధర్మం, భగవంతుని అండ తోడుగా వుంటాయి. తను దిగులు జెందనక్కర్లేదు. వారి కే ఆపదా రాదు. అంతిమ విజయం భారతదేశానికే!... ఆమె అవిధమైన ఆలోచనలో వుండగా, తల్లి సుభద్రమ్మ ప్రక్కింట్లోంచి మహాదూకుడుగా వచ్చింది.

"ఏమే! విన్నావా! అక్కడ యుద్ధం జోరుగా సాగుతూన్నదట. మన సైనికులు వేలకు వేలు చస్తున్నారట. ఇవాళ పేపర్లో పడిందట. వెంకట్రామయ్యగారు అన్నారు. నాకేమో మీా ఆయన గురించి భయంగావుంది."

గాలి తీవ్రతకు చెట్టునవున్న ఆఖరాకు గజగజలాడినట్లు నాగరత్నమ్మగుండె గజగజలాడింది. కాని వెంటనే నిలదొక్కుకున్నది.

"అవన్నీ నిజం కావే అమ్మా! మన ప్రభుత్వం ప్రకటించిందిగా — మరణించిన వాళ్ళ సంఖ్య స్వల్పమట. అయినా దేశంకోసం ప్రాణాలకు తెగించి పోరాడే వాళ్ళను గురించి మనం అపశకునంగా అనుకోవట మేమిటి? పైన భగవంతుడున్నాడు. భయపడనక్కర్లేదు." అన్నది నాగరత్నమ్మ చాటలోని బియ్యంలోనికి వ్రేళ్ళు పోనిచ్చి గీతలు గీస్తూ.

"నీ గుండె ధైర్యం ఎట్లాంటిదే!" గొణుక్కుంటూ సుభద్రమ్మ ఇంట్లోకి వెళ్ళింది.

అదే రోజు భర్త దగ్గర్నుంచి నాగరత్నమ్మకు లేఖ వచ్చింది. అందులో ఇలా ఉంది:

"ప్రియమైన శ్రీమతికి —

నేను యుద్ధరంగంలో ఈ క్షణం వరకూ క్షేమంగానే ఉన్నాను. కాని నా క్షేమం కాదు కావల్సింది. నా సోదర జవాన్ల క్షేమం, భారతదేశపు క్షేమం. చైనా రాక్షసులు మన దేశంపై ప్రబలమైన దురాక్రమణ చర్య జరుపుతూన్న విషయం ఈపాటికి నీకు తెలిసే వుంటుంది. తాత్కాలికంగా మనం కొన్ని అపజయాల్ని పొందుతూన్నమాట కూడా వాస్తవమే.

నిద్ర బోతున్న వాడి మీదకు దొంగచాటుగా దాడిజరిపితే_ అల్లాంటి అపజయాలు తప్పవు. సైనిక పునఃసమీకరణ కోసం మనం కొన్ని స్థావరాల్ని ఖాళీ చేయాల్సికూడా వస్తూన్నది.

నేను నేఫా తూర్పురంగం డివిజన్‌లో వున్నాను. నవంబరు పదిహేనవ తేదీ రాత్రి వలాంగ్‌లో చైనా ముష్కరులు పెద్ద ఎత్తున దాడి ప్రారంభించారు. భారీ శతఘ్నులు, మోర్టారులు, ఆటోమేటిక్ రైఫిల్స్ మొదలైన ఆధునిక ఆయుధాలతో, అత్యధిక సంఖ్యలో, పెద్ద వరద వొచ్చినట్టు వొచ్చిపడ్డారు. ఎంతినష్టం జరిగినప్పటికీ, ఎన్ని వేలమంది మన చేతుల్లో నిహతులైనప్పటికీ పదిహేను దాడుల్ని తిప్పికొట్టాము మూడు రోజులపాటు భీషణ సమరం సాగింది. పధ్నాలుగు వేల అడుగుల ఎత్తున మంచుకొండల భీకర శీతల వాయువుల్లో, ఎముకలు కొరుక్కుతినే చలిలో రక్తం గడ్డకట్టే ఉష్ణోగ్రతలో, నీరూ, ఆహారం సరిగ్గాఅందని దుర్గమైన ప్రాంతాల్లో శత్రుమూకను శక్తివంతంగా ప్రతిఘటించాము. కాని 15 వేల సంఖ్యాబలంతో. ఆధునిక ఆయుధ సంపత్తితో మిన్ను విరిగి మీాద పడ్డట్టుగా వచ్చిపడ్డ చైనా రాక్షసమూకను, వాళ్ళ దొంగ యుద్ధాన్ని కుతంత్రపు ఎత్తులనూ, చాటు మాటు పోరాటాన్ని మనం పూర్తిగా ఎదుర్కోలేక పోయాము. వలాంగ్‌నుంచి ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. కాని స్వతంత్ర భారతచరిత్రలో ఈపోరాటాన్ని సువర్ణాక్షరాలతో అలంకరించవల్సి వుంటుంది. ఏడు మైళ్ళ పొడవున ప్రమాద భరితమైన పర్వత ప్రాంతంలో వున్న యుద్ధరంగంలో మన జవాన్లు గడగడ వణికే చలిలో, త్రాగడానికి నీరూ, తినడా

నికి తిండీ దొరక్కపోయినా అగ్రస్థావరాల్ని అంటిపెట్టుకొని, అపూర్వమైన ధైర్య సాహసాలతో, మాతృదేశంపట్ల ప్రేమానురాగాలు పరవళ్లు త్రొక్కుతూండగా, అంకురిత దీక్షతో, అంగుళం అంగుళం తీవ్రంగా పోరాడారు. ఇందులో ఒక దాడిలో ఒక నాన్ కమీషన్డు ఆఫీసరు సిపాయ్ కెవాల్‌సింగ్ తన కందకం లోంచి పులిలా బయటకు దుమికి శత్రువులపై గుళ్ళ వర్షం కురిపించి, చీల్చి చెండాడి, ఎనిమిదిమందిని చంపి, తాను శత్రువుల కాల్పులకు గురియై, వీరస్వర్గ మలంకరించాడు. చరిత్రలోలిఖించ వల్సిన ఇలాంటి సంఘటనలూ, వీర మరణ గాథలూ అనేకం.

ఏమైనా గెలుపు మనదే! అమితమైన గుండె నిబ్బరంతో, దృఢమైన ధైర్యసాహసాలతో, ప్రాణాలను లెక్కచేయకుండా మాతృదేశ రక్షణకోసం వీరోచితంగా పోరాడే మన జవాన్లకే గెలుపు. ధర్మం, న్యాయం మన పక్షానవుంది. భగవంతుని బలం మనకుంది. మన సైన్యాల సమీకరణ పెద్దఎత్తున జరుగుతూన్నది. వాళ్ళ దాడుల్ని త్రిప్పికొట్టగలుగుతున్నాం. దురాక్రమిత ప్రాంతాల్నుంచి చైనా మూకను తరిమివేసే వరకూ విశ్రమించం. ప్రతి సైనికుడూ, ప్రతి ఆఫీసరూ స్వాతంత్రం పరిరక్షణకు కఠోరమైన ప్రతిజ్ఞ తీసుకొని నిర్విరామంగా, హృదయపూర్వకంగా, గట్టి విశ్వాసంతో కృషి చేస్తున్నారు.

నన్ను గురించి కలలోనైనా దిగులు పడకు. దురదృష్టవశాత్తూ నేను యుద్ధ భూమిలో మృతిజెందినా – దుఃఖించ

వల్సిన తరుణం కాదు. ఈ భావానికి నీ కళ్లు అప్పుడే నీళ్ళతో నిండవచ్చు. అదికాదు క ర్తవ్యం. ఈ అత్యాయిక పరిస్థితిలో ప్రతి భారతీయుడూ, ప్రతి భారతీయస్త్రీ - మన దేశం పట్ల, దృఢ విశ్వాసం కలిగి, దుర్మార్గులు పుట్టించే పుకార్లు, భయాలూ వినకుండా, దేశంకోసం శ క్తివంచన లేకుండా ఏదో రూపంలో పాటుబడాలి.

మన పాపకు ముద్దులు. త్వరలోనే విజయాన్ని సాధించి తిరిగి వస్తానని చెప్పు. మా అమ్మను అడిగానని చెప్పు. ఆవి డను అనవసరంగా ఖంగారు పడొద్దని చెప్పు.

దేశరక్షణే జీవితాదర్శంగా యెంచి తుపాకి పట్టిన నీ భ ర్త — నాసరయ్య.

ఆ ఉ త్తరము చదువుకొని నాగర త్నమ్మ సంపూర్ణంగా సంతోషపడింది. తల్లికి చదివి వినిపించింది. కాని ఆవిడ అనవ సరంగా నిట్టూర్పు విడిచింది.

*　　*　　*　　*

1962 అక్టోబరు 20 వ తేదీ అర్ధరాత్రి చైనా దుండగీ డులు అన్యాయంగా, అక్రమంగా, అక్రమంగా అకారణంగా పెద్ద ఎత్తున ప్రారంభించిన దాడులు నెల రోజులు గడిచినా ఘోరంగా సాగుతూనే ఉన్నాయి. అతి ఆధునిక ఆయుధా లతో, అత్యధిక సంఖ్యలో చైనా ముష్కరులు - నాగరిక ప్రపంచానికి తలనొప్పిగా, శాంతియుత సహజీవనానికి వెన్నుపోటుగా, మానవత్వానికి మారణ హోమంగా, దురాక్రమణ చేస్తూనే ఉన్నారు. మన భూమిపైకి చొచ్చుకొని వస్తున్నారు.

భారీ ఎత్తున దాడుల్ని ఎదుర్కొనే సమర సన్నాహాల్ని చేసు కొని వుండకపోవడం వల్ల, పునః సమీకరణ నిమిత్తం, వాతా వరణం కల్సి రాకపోవడంచేత – మనం కొన్ని స్థావరాల్ని వదులుకోవాల్సి వచ్చింది. తవాంగ్, జాంగ్, వలాంగ్ వాళ్ళ చేతుల్లో పడిపోయాయి. దేశం తీవ్రంగా మేల్కొంది. ప్రతి భారతీయుని గుండె ఎర్రబడింది. మాతృదేశ రక్షణకు దృఢంగా ప్రతిజ్ఞ తీసుకోవడం జరిగింది. శక్తివంచన లేకుండా ప్రజలు విరివిగా ధన, కనక, వస్తు రూపేణా విరాళాలు ఇస్తున్నారు. యువకులు ఉత్సాహంగా సైన్యంలో చేరుతున్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు, చదువుకొన్నవారు ఎమర్జన్సీ సర్వీసుల్లో ప్రవేశిస్తు న్నారు. దేశమంతా ఒక్కసారి కదిలింది. నవచైతన్యం నవ భారత రక్షణకోసం, చైనా రాక్షసుల్ని తరిమి కొట్టేందుకు, పిల్లలు మొదలు......ఉత్సాహం, ఉద్రేకం, పట్టుదల, పళ్ళు బిగువూ ప్రజల్లో ఉవ్వెత్తుగా లేచాయి. 'గెలుపు మనదే!' ప్రతి భారతీయుని గుండెలో ఆ విశ్వాసం కాగడాలా వెలుగు తుండగా – ప్రజావాహిని ఉద్ధృతంగా సాగింది.

భర్త దగ్గర్నుంచి మళ్ళీ ఉత్తరం రాకపోయేప్పటికి నాగరత్నమ్మ భయపడింది. ఆమె భయాన్ని తల్లి ద్విగుణీకృత పరిచింది.

"ఏమో నాకేమీ నమ్మకంలేదు. యుద్ధంలో వేలకు వేలు చచ్చారంట. ఈ పత్రికలవాళ్ళు చచ్చినవాళ్ళ సంఖ్యను సరిగ్గా వేయడం లేదట– ప్రజలు భయపడతారని. నిన్న అం కయ్యగారి రామసుబ్బయ్య అన్నాడు. మీ ఆయన ఏ తుపాకి

గుండుకో..." ఆపైన ఆవిడ గొంతు దుఃఖోద్వేగంతో వొణికింది.

నాగరత్నమ్మ దిగులుతో పూర్తిగా కృంగిపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు గట్లుతెగిన ప్రవాహమైనాయి.

ఆరోజే ఆమె భర్తనుగురించి వాకబుచేస్తూ మిలిటరీ ఆఫీసర్లకు ఉత్తరాలు వ్రాసింది. సమాధానాలకోసం కళ్ళల్లో ఆశల కొవ్వొత్తుల్ని వెలిగించుకొని కూర్చుంది. వారం, పది రోజులు గడిచినా జవాబులు రాలేదు. ఆమెలో అధైర్యం జాస్తి కాజొచ్చింది. అందుకు తోడుగా తల్లి ఊళ్ళోవాళ్ళ కబుర్లను కూతురికి అందిస్తూ పిరికితనాన్ని పెంపొందించ సాగింది.

ఓరోజు సాయంత్రం పాప బళ్ళోనుంచి ఏడుస్తూ ఇంటికి వచ్చింది. నాగరత్నమ్మ ఆదుర్దాతో దగ్గరకు తీసుకొని, "ఎందుకు పాపా! ఏడుస్తున్నావు?" అన్నది. పాప ఏడుస్తూనే, "మరే...అమ్మా ... బళ్ళోనే ... అంతా 'నాన్న యుద్ధంలో చచ్చిపోయాడు' అంటున్నారమ్మా...నిజమేనా" అన్నది మునివేళ్ళతో కళ్లు నలుపుకుంటూ.

నాగరత్నమ్మ గుండెల్లో తుప్పాకత్తితో కెలికినట్లయింది. "ఛీ. ఒట్టిదేనమ్మా! అంతా అబద్ధం! నాన్నగారు యుద్ధంలో కులాసాగా ఉన్నారు. గెలుపు మనదేగా! త్వరలోనే వచ్చేస్తారు. అట్లాంటి చెప్పుడు మాటలు విని ఏడ్వకూడదు. మీ నాన్నగారు యుద్ధంలో చచ్చిపోరు. మనకు దేవుడు తోడుగా వున్నాడు. యుద్ధంలో విజయం సాధించే యింటికి

వస్తారు." అన్నది నాగరత్నమ్మ చాటుగా కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"నిజంగా..." అన్నది పాప కొనుతో చెంపలపైకి జారిన కన్నీళ్ళను తుడుచుకుంటూ.

"ఆఁ! ముమ్మాటికి నిజంగా." మనస్సులో గట్టిపడిన విశ్వాసంతో అంటూ నాగరత్నమ్మ పాపను హృదయానికి గాఢంగా అదుముకొంది.

ఆ రోజు రాత్రి నాగరత్నమ్మకో కల వొచ్చింది. కలలో — భర్త చైనా వాళ్ళకు ఖైదీగా దొరికినట్టూ, మన సరిహద్దులు దాటి తీసికెళ్ళినట్టూ, టిబెట్టు ప్రాంతంలో వాళ్ళ స్థావరాల్లో నానాబాధలూ పడినట్టూ ఆవిడకు గోచరమైంది. కల తెగిపోగా 'కెవ్వు'న కేక వేసింది నాగరత్నమ్మ. ఆ కేకను ఎవ్వరూ వినలేదు. ఓ గ్లాసు మంచినీళ్ళు త్రాగి తెల్లవార్లూ ఆలోచిస్తూనే కూర్చుంది.

*   *   *   *

నవంబరు 21 వ తేదీన చైనా ముష్కరులు ఏకపక్ష యుద్ధ విరమణ చేశారు. అందులో అంతరార్థాన్ని గూర్చి భారత దేశమే కాకుండా ప్రపంచమే ఆశ్చర్యాన్ని ప్రకటించింది. సరిహద్దు సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు కొన్ని మిత్రరాజ్యాలు మధ్యవర్తిత్వాన్ని చేపట్టి, కృషిని సాగించ పూనుకున్నాయి. ప్రధాని నెహ్రూ, తదితర నాయకులూ — "యుద్ధ విరమణ శాశ్వతంగా జరిగిందను కోవటానికి

వీల్లేదు. చైనావాళ్లు ఏక్షణాన్నయినా మళ్ళీ మనపై దాడిచేయవచ్చు. మనం మన జాగ్రత్తల్లో, మన గడ్డ రక్షణలో పూర్తిగా మెలకువ గలిగి వుండాలి. శత్రువును సులభంగా ఎదుర్కొని పటిష్ఠంగా బుద్ధిచెప్పే బలాన్నీ, ధైర్యాన్నీ పొంది వుండాలి. భారతదేశపు ప్రతిపౌరుడూ ఆ కర్తవ్యాన్ని గుర్తించాలి. ఆత్మ విశ్వాసంతో, శక్తివంచన లేకుండా, తీవ్రమైన దీక్షతో కృషిచేయాలి. అనవసపు వ్యయాన్ని తగ్గించుకోవాలి. నిర్బంధపు పొదుపు అమల్లో పెట్టాలి. ఉత్పత్తుల్ని పెంచాలి. బంగారంమీద వ్యామోహాన్ని వొదులుకోవాలి. జాతీయ రక్షణ నిధికి విరివిగా విరాళాలివ్వాలి.” అంటూ ప్రకటనలు చేస్తున్నారు. దేశంలో అత్యయిక పరిస్థితి అమల్లోనే వుంది.

నాగరత్తమ్మకు భర్తనుంచి ఏ జాబూ రాలేదు. తల్లితోపాటు ఊళ్ళో వాళ్ళంతా ‘నాసరయ్య యుద్ధంలో మరణించి వుంటాడు.’ అన్న అభిప్రాయాన్ని గట్టి పర్చుకున్నారు. గానీ ఆమె మటుకు ధైర్యంగానే వున్నది. నిత్యమూ భర్తనుంచి లేఖ కోసం నిరీక్షిస్తూనే ఉంది.

ఓ రోజు సాయంత్రం సుభద్రమ్మ వెండి మెట్టెలకోసం కావిడి పెట్టంతా వెతుకుతూ అడుగున ఈతాకుల బుట్టతీసి చూసింది. ఆవిడగుండె ఆగిపోయినంత పనైంది. అందులో తను దాచుకొన్న బంగారు మురుగులు లేవు. గావు కేక పెట్టింది; “ఒసేయ్ అమ్మాయ్!”

పంచముందు పాచి వూడుస్తూన్న నాగరత్తమ్మ తల్లికేదో ప్రమాదం వొచ్చిందని పరుగెత్తుకొచ్చింది.

"ఇందులో బంగారపు మురుగు లుండాలి. ఏమై
నాయే?"

"ఏమో నమ్మా! నాకేమీ తెలీదే"

"చోద్యంగా వుందే. అయితే దొంగ లెత్తుకెళ్ళారం
టావా?"

"మనింట్లో దొంగలెప్పుడు పడ్డారు?"

"అయితే మరేమైనట్టు?"

"ఏమో! అంతుబట్టకుండా వుంది"

అంతలో స్కూలునుంచి పాప వొచ్చింది. "అమ్మా! అమ్మా! నేనే చేశాంనో చెప్పుకో" అంటూ.

"ఏం చేశావమ్మా!" అన్నది నాగరత్తమ్మ ఆప్యాయంగా.

"కావిడి పెట్టెలోని అమ్మమ్మ బంగారు మురుగులు తీసికెళ్ళి మా మాష్టారు కిచ్చానమ్మా! ఆయన దేశరక్షణ నిధికి బంగారు నగలూ, డబ్బూ పోగుచేస్తున్నాడు. మా స్కూల్లో అందరూ యిచ్చారమ్మా. వాళ్ళ సుబ్బులు చెవి పోగు లిచ్చింది. అత్తయ్యగారి శాంత చెవిగాజు లిచ్చింది. కోటయ్య బాబాయిగారి అమ్మాయి మెడలో గొలుసిచ్చింది. మరి నా కవేమీ లేవుగా. అందుకని అమ్మమ్మ మురుగు లిచ్చా. అవిపెట్టెలో వూరికే మూలబడి వుండేవేగా."

కూతురు చేసిన పనికి నాగరత్తమ్మ నిండుగా సంతోష పడింది. ఆమె కళ్ళల్లో ఆనంద బాష్పాలు నిలిచాయి.

కాని సుభద్రమ్మ చిందులు తొక్కింది — బంగారు మురుగులు పోయినందుకు. అవి ఆవిడ పెళ్ళినాటివి.

నాగరత్నమ్మ తల్లికి నచ్చజెప్పింది.

"ఈపరిస్థితుల్లో బంగారానికి విలువ ఇళ్ళల్లో పెట్టెల్లో మూలుగుతూ వుండటం వల్ల రవ్వంత లాభం లేదు. దేశం కోశం' ఎన్నోయేళ్ళ తరబడి, ఎంతోమంది త్యాగాలు చేసి సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని రక్షించుకునేందుకు, మానవత్వాన్ని మర్చిపోయిన రాక్షసుల్ని ఎదుర్కొనేందుకు — మనకు ఆయుధాలు కావాలి. వాటిని విదేశాల్నుంచి తెప్పించుకోవాలి. అందుకు బంగారం హెచ్చుగా ఉపయోగపడుతుంది. అత్యయిక పరిస్థితుల్లో బంగారం స్త్రీలకు అలంకారం కాదు. దేశానికి అవసరం. ఆ అవసరాన్ని గుర్తించి, భారతీయ స్త్రీలంతా తమ బంగారాన్ని ప్రభుత్వానికి ఉచితంగా సమర్పించాల్సిన తరుణమిది. మనకంటె మన పాపే ఆ అవసరాన్ని త్వరగా గుర్తించి చక్కని పని చేసింది."

సుభద్రమ్మ ఏం మాట్లాడలేకపోయింది — మనస్సులో బాధపడటం కంటె.

ఆ మరునాడు పగలు పదకొండు గంటలకు పాప స్కూలునుంచి పరిగెత్తుకొంటూ ఇంటికి వచ్చింది. ఆ పిల్ల చేతిలో వార్తా పత్రిక ఉంది. మాస్టరుగారు ఇచ్చారు.

నాగరత్నమ్మ వాకిట్లో నిలబడి పెరుగు అమ్ముకునే వెంకమ్మతో మాట్లాడుతూన్నది.

"అమ్మా! అమ్మా! ఈ పేపరు చూశావా! నాన్న బతికే వున్నాడమ్మా !"

నాగరత్నమ్మ కూతురు దగ్గర్నుంచి గబుక్కున పేపరు అందుకున్నది. చైనావాళ్ళు విడుదలచేసిన కొంతమంది యుద్ధ ఖైదీల ఫోటో వుంది. ఆ ఫోటోలో నాసరయ్యకూడా ఉన్నాడు భర్తనుచూసి నాగరత్నమ్మ కళ్ళు ఆనందోద్రేకంతో చెమర్చగా అప్రయత్నంగా పైటచెంగుతో తుడుచుకుంది.

"నాన్న బొమ్మ పేపర్లో పడిందమ్మా! మనమే గెలిచాం. గెలుపు మనదే అమ్మా!" అన్నది పాప గంతులేస్తూ.

—ఆంధ్రప్రదేశ్